ముంపు సమస్యకు త్వరలో మోక్షం

- తొర్రిగెడ్డ కాలువపై రివర్స్ పంపింగ్ ప్రాజెక్టు
- రూ.91.10 కోట్లతో నిర్మాణానికి చర్యలు

మధురపూడి: సుదీర్ఘ కాలంగా ఉన్న ముంపు సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని చూపింది. నాలుగు దశాబ్దాలుగా ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సఫలీకృతులయ్యారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లో గోదావరి ముంపు సమస్య పరిష్కారం కానుంది. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్య.. కొద్దికాలంలో ఓ కొలిక్కి రానుంది. ఏటా అఖండ గోదావరి వరద ప్రవాహానికి రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం మండలాల్లోని గ్రామాలతో పాటు, రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని తొర్రేడు, పరిసర గ్రామాలకు ఈ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. గోదావరి ఎగపోటు కారణంగా వరద నీరు గ్రామాల్లోని ఇళ్లను, పొలాలను ముంచెత్తుతోంది. దీంతో 20 గ్రామాలకు చెందిన 13 వేల మంది సాగు చేస్తున్న 25 వేల ఎకరాల విస్తీర్ణంలోని పంటలు ముంపు బారిన పడుతున్నాయి.

ఫలించిన రైతన్నల కల

రైతన్నలు ఎంతో కాలంగా ఈ సమస్య పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు. నాలుగు దశాబ్దాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, పొగాకు పంటలను వేల కోట్ల రూపాయల మేర నష్టపోయారు. రబీ సీజన్‌లో బుచ్చెంపేట, గుమ్ములూరు, కాపవరం, మునగాల, కూనవరం గ్రామాల్లో కూరగాయలను పండించడం సాధ్యం కాలేదు. ఈ గండం నుంచి గట్టెక్కించాలని



ఉధృతంగా ప్రవహిస్తున్న తొర్రిగెడ్డ కాలువ (ఫైల్)



గోదావరి వరద కారణంగా నీట మునిగిన పంట పొలాలు (ఫైల్)

రైతులు ఎందరు పాలకులను కోరినా, ప్రజాప్రతినిధులు, అధికారులకు కోకొల్లలుగా వినతిపత్రాలిచ్చినా ప్రయోజనం లేకపోయింది. గత ఎన్నికల ప్రచారంలో ఈ సమస్యపై దృష్టి పెట్టిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.. రైతన్నలకు భరోసా కల్పించారు. దీనిని ఆచరణాత్మకంగా చూపడంతో రైతన్నలకు నమ్మకం ఏర్పడింది. ఏళ్ల తరబడి సమస్యకు పరిష్కారం లభించడంతో రైతన్నల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

రివర్స్ పంపింగ్ విధానం

నదుల నీటిని సాగు అవసరాలకు తోడటం సహజం. దీనికి భిన్నంగా కాలువల్లోకి చేరిన నీటిని గోదావరిలోకి తోడటం ఇక్కడి ప్రత్యేకత, రూ.91.10 కోట్లతో రివర్స్ పంపింగ్ స్కీమ్‌ను సీతానగరం మండలం బొబ్బిల్లంక తొర్రిగెడ్డ కాలువపై ఏర్పాటు చేస్తారు. ఈ స్కీమ్‌లో 850 హెచ్‌పీ సామర్థ్యంతో పది పంపులు పనిచేస్తాయి. వీటి ద్వారా తొర్రిగెడ్డ కాలువలోని నీరు గోదావరిలోకి చేరుతుంది. గోదావరి నదిలోకి పది లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరినప్పుడు, దానిని బయటకు వదిలేందుకు అవుట్‌ఫాల్ స్లూయిజ్ ఏర్పాటు చేస్తారు. ఇది సాంకేతికంగా మూసుకుపోవడంతో గోదావరి నీరు తొర్రిగెడ్డలోకి చేరదు, దీంతో దిగువ గ్రామాలకు, పొలాలకు ముంపు బెడద తప్పుతుంది.

సమస్య తీరినట్టే..

కోరుకొండ మండలం బూరుగుపూడి అయ్యన్నగళ్ల కాలువ నుంచి ప్రవహించే కాలువ, గోకవరం మండలం నుంచి శ్రీరంగపట్నం మీదుగా ప్రవహించే బురద కాలువ వరద నీరు. గంగవరం మండలంలోని సూరంపాలెం ప్రాజెక్టు మిగులు జలాలు రావడంతో కాలువ నిండిపోయి ప్రమాదకరంగా అవుతోంది. బొబ్బిల్లంకలో రివర్స్ పంపింగ్ స్కీమ్ నిర్మాణంతో ఈ సమస్య కూడా పరిష్కారం కానుంది. బురద కాలువ కారణంగా శ్రీరంగపట్నం ముంపు సమస్య తీరినట్టే.

> **శ్రమకోర్చి.. ఫలితం సాధించాం**
>
> ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ముంపు సమస్య కొలిక్కిరావడంలో ఎంతో శ్రమ దాగుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రోత్సాహంతో రివర్స్ పంపింగ్ స్కీమ్ నిర్మాణానికి ఆమోదం పొందాం. రూ.91.10 కోట్ల నిధులతో తొర్రిగెడ్డ మీద నిర్మించే స్కీమ్‌లో 850 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న పది పంపులు పది లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి తోడతాయి. దీంతో 20 గ్రామాల్లోని 13 వేల మంది రైతన్నలు సాగు చేసే 25 వేల ఎకరాలు ముంపు బారి నుంచి బయటపడతాయి.
>
> 
>
> – జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, రాజానగరం

బొబ్బిల్లంక హైస్కూల్లో స్టాండర్డ్ క్లబ్



మాట్లాడుతున్న హెచ్ఎం సత్యనారాయణ

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ క్లబ్ ప్రారంభమైందని ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వినియోగ వ్యవహారాల మంత్రిత్వశాఖ దీనిని మంజూరు చేసిందన్నారు. ఈ క్లబ్ ద్వారా విద్యార్థులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ కార్యక్రమాలపైనా, వస్తువుల స్వచ్ఛతా ప్రమాణాలను తెలుసుకోవడానికి అనుసరించాల్సిన విధానాలపైనా పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. క్లబ్ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్టాండర్డ్ పరీక్షా విధానంపై జిల్లా రిసోర్స్ పర్సన్ బి.ఆంజనేయులు ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించి, విజేతలకు నగదు బహుమతి అందజేశారు. పాఠశాల స్టాండర్డ్ క్లబ్ మెంటార్ ఉల్లి రామకృష్ణ, సుందరరావు పాల్గొన్నారు.

బాబాకు క్షీరాభిషేకం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి బాబా ఆలయంలో గురువారం భక్తులు 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం చేశారు. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు, అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంటే నాగ కేశవరావు, కంటే సత్యచక్ర గణపతి, మూతిన శివ మోహన్, గూడపాటి పెద్ద పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అద్భుతం



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి ఆహ్వానం పలుకుతున్న జక్కంపూడి గణేష్

రాజానగరం: దివాన్ చెరువుకు చెందిన బండి ప్రదీప్ రాజు, బండి రాహుల్ వైఎస్సార్ సీపీలో చేరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి గేట్ వద్ద ఈ నెల 7న నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ నియోజకవర్గంలో పర్యటిస్తున్న వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ గురువారం దివాన్ చెరువు చేరుకున్న సమయంలో ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, పార్టీ నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, పలివెల స్వామి, బండి నారాయుడు. పిల్లా లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీమా పథకంలో చేరాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

సీతానగరం: స్థానిక శివాలయం ఆవరణలో గురువారం సిద్ది వినాయక ఎలక్ట్రీషియన్స్, ప్లంబ్లింగ్ హెల్పర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ మండల అధ్యక్షుడు లక్కిశెట్టి శివనాగరాజు, ఉపాధ్యక్షుడు ఆకుమూరి బాపిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ కల్పించిన ఉచిత బీమా పథకంలో ప్రతి ఒక్కరూ చేరాలన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గౌరవ అధ్యక్షుడు ఎస్ఈవీ సత్యనారాయణ, కార్యదర్శి మడిచర్ల అరుణ్ కుమార్, జాయింట్ సెక్రటరీ నేలపాటి గౌరీ శంకర్, ట్రెజరర్ పీతల కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు



మల్లిపూడిలో క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

రంగంపేట: గ్రామాల్లో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి వారిని అత్యుత్తమంగా తీర్చిదిద్దడం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అన్నారు. మండలంలోని మల్లిపూడిలో జరుగుతున్న క్రీడా పోటీలను గురువారం ఆమె పరిశీలించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్ తదితర పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేము మాధవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత లూయిస్ బ్రెయిలీ



బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

సీటీఆర్ఐ: బ్రెయిలీ లిపి ద్వారా అంధులకు జీవితం ప్రసాదించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ మాధవీలత కొనియాడారు. బ్రెయిలీ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఆయనకు ఎస్పీ పి.జగదీష్, అంధ ఉద్యోగి పి.రామలక్ష్మితో కలిసి నివాళులర్పించారు. అనంతరం 2024 బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నేటి ఆధునిక ఆవిష్కరణలకు స్ఫూర్తి ప్రదాత లూయిస్ బ్రెయిలీ అన్నారు. బ్రెయిలీ లూయిస్ బతికుండగా ఈ లిపి గురించి ఎవరూ పట్టించుకోలేదన్నారు. కానీ ఆయన మరణించిన రెండేళ్లకే 1854లో లూయిస్ రూపొందించిన ఆల్ఫాబెట్ సిస్టమ్‌ను ఫ్రెంచి ప్రభుత్వం గుర్తించి, అక్కడి అంధ విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. నాడు బ్రెయిలీ సృష్టించిన లిపికి 1982లో ఎలక్ట్రానిక్ బ్రెయిలీ డిస్‌ప్లే, తదుపరి ఎలక్ట్రానిక్ నోట్స్, డిజిటల్ ఆడియో బుక్స్, కంప్యూటర్ స్క్రీన్ రీడర్స్, వాయిస్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్, డిజిటల్ లైబ్రరీలు ఎన్నో నూతన ఆవిష్కరణలకు నాంది పలికింది అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, జిల్లా దివ్యాంగుల శాఖ పర్యవేక్షకుడు బి.నాగభూషణం, దివ్యాంగుల సంక్షేమం, దృశ్య లోప ప్రతిభావంతులు సంఘం ప్రతినిధి ఎన్.రామలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి



రామేశ్వరంలో టీడీపీ, జనసేన నాయకులకు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రామేశ్వరంలో టీడీపీ, జనసేనల నుంచి 40 మంది వైఎస్సార్ సీపీలోకి చేరిక

పెదపూడి: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త శక్తి వంచన లేకుండా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. రామేశ్వరంలో టీడీపీ, జనసేన పార్టీల నుంచి సుమారు 40 మంది మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు వైఎస్సార్ సీపీలో గురువారం చేరారు. నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ కొటికలపూడి సూర్యప్రభ భర్త కొటికలపూడి సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ షేక్ బాబ్జి తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతీఒక్కరికి సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీలో నూతనంగా చేరిన వారు, వైఎస్సార్ సీపీ శ్రేణులు కలిసి నూతన ఉత్సాహంతో పనిచేసి తనను ఎమ్మెల్యేగా, జగన్‌ను మళ్లీ సీఎంగా భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా యూత్ నాయకుడు కొటికలపూడి గణేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల ఈశ్వర వెంకట సుబ్రహ్మణ్యం, ఉపసర్పంచ్ దుళ్ల వీరవెంకట సత్యనారాయణ, పార్టీ గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, తిరుమలశెట్టి వెంకటరమణ, మండల మహిళా సమాఖ్య ప్రతినిధి బసవ విజయకుమారి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, నియోజకవర్గ ప్రచార కమిటీ కన్వీనర్ రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుపై అవగాహన

ఏపీత్రయం, రామేశ్వరం గ్రామాల్లో పింఛన్ల పెంపుపై లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సమావేశాలకు ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. పీఏసీఎస్ చైర్మన్ చైర్మన్ గుండా ఈశ్వరరావు, సర్పంచ్ అడబాల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

రంగంపేట: మండలంలోని పెదరాయవరంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, పశువైద్యాధికారి జాన్‌పాల్‌లు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశుల్లో తీవ్రమైన జ్వరం, నీరసం, రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. పాడి రైతులందరూ తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం పశువుల కొట్టాలకు వెళ్లి టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి జాన్‌పాల్, సర్పంచ్ పెంటా సుజాత, పశు వైద్య సిబ్బంది వీఎస్ మురళీకృష్ణ, సీహెచ్ సత్యకుమార్, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షతల ఊరేగింపు



కాటవరంలో పల్లకీపై అక్షతలను ఊరేగిస్తున్న భక్తులు

సీతానగరం: అయోధ్య రామయ్య మందిర తీర్థక్షేత్ర ట్రస్ట్ అందించిన అక్షతలను గురువారం కాటవరంలో పల్లకీపై ఊరేగించారు. గ్రామంలోని రామాలయం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. బీజేపీ రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి భక్తులకు అక్షతలు అందించారు. కార్యక్రమంలో గూడపటి జయరామ్, బూరుగుపల్లి బంగారయ్య, సమరసత ఫౌండేషన్ డివిజన్ ఇన్‌చార్జి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అయోధ్య అక్షతల పంపిణీ

రంగంపేట: మండలంలోని సుభద్రంపేటలో అయోధ్య రామ మందిర నిర్మాణ పూజ అక్షతలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.సాయిరాం, గ్రామ పెద్దలు కూటి సాయిబాబు, పేపకాయల రామచంద్రరావు, పూసల సత్యనారాయణ, కోసూరి సత్యనారాయణ, పేపకాయల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిపై అవగాహన కల్పించాలి



శ్రీరంగపట్నంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: వచ్చే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధం లాంటివని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ సైనికుల్లా పోరాటం చేయాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపు నిచ్చారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, కోటి గ్రామాల్లో గురువారం వైఎస్సార్ సీపీ ప్రధాన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. శ్రీరంగపట్నంలో రూ.8 కోట్లు, కోటిలో రూ.8.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ప్రజలకు మనం చేసిన సేవా కార్యక్రమాలను గుర్తుచేయాలన్నారు. శ్రీరంగపట్నానికి చెందిన పలువురు కళాకారులు రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులైనప్పుడు హుటాహుటిన వైద్యసేవలు అందజేశామన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం, క్షతగాత్రులకు సంపూర్ణంగా వైద్యసేవలు అందించడంలో గ్రామానికి చెందిన నాయకుల పాత్రను అభినందించారు. శ్రీరంగపట్నంలో బురద కాలువ ముంపు సమస్య పరిష్కారానికి ఎనలేని కృషి చేసినట్టు తెలిపారు. గత టీడీపీ పాలనలో ముంపు సమస్య తీవ్రంగా ఉండేదన్నారు. వ్యవసాయాధారిత ప్రాంతమైన కోరుకొండ మండలంలో సాగు, తాగునీటి సదుపాయాన్ని కల్పించడం జరిగిందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసయ్య, శ్రీరంగపట్నం ఎంపీటీసీ నూకరాజు, కోటి సర్పంచ్ వెంటపాటి దుర్గారావు, ఎంపీటీసీ గట్టి వీర ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు సూరిశెట్టి కుటుంబరావు, అడపా కుమార్, నానాజీ, అప్పలస్వామి పాల్గొన్నారు.

ఆలయ మండపం నిర్మాణానికి శంకుస్థాపన



కరకుదురులో ముఖ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: మండలంలోని కరకుదురులో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించనున్న కల్యాణ వేదిక, ముఖ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులకు పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల్లో కూర్చున్న ఎమ్మెల్యే దంపతులకు పండితులు ఆశీర్వచనలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 200 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయంలో కల్యాణ వేదిక, ముఖ మండపం అవసరమని స్థానికులు తెలపడంతో నిధులు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటరమణ, సర్పంచులు వుండ్రు చంద్రకళ, నూని పట్టాభిరామన్న చౌదరి, వల్లు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు కరెడ్ల వెంకన్నబాబు, పెదపూడి సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, ఆలయ ఈఓ మోర్త మురళి తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు మారు పేరు జగనన్న

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



పందలపాకలో వృద్ధులకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: విశ్వసనీయతకు మారుపేరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బిక్కవోలు, ఊలపల్లి, పందలపాక, బలభద్రపురం గ్రామాల్లో లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుకను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండటంతో మాయ మాటలతో వంచించడానికి పచ్చ నేతలు వస్తున్నారని, వారితో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని, గత ఎన్నికలకు ముందు పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన 99 శాతం వాగ్దానాలను నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో పందలపాక సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గండి వాసు, సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, బొద్దు ముత్యాలరావు, కర్రి ఇస్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్‌కు ఆదరణ

రాజమహేంద్రవరం సిటీ: స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులతో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మెప్మా సిటీ మిషన్ డీఆర్పీ శ్రీలలిత అన్నారు. మహిళలు స్వయంగా తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా వారిని ఆర్థికంగా ప్రోత్సహించే అవకాశం ఉంటుందన్నారు. నగరంలోని పుష్కరఘాట్ వద్ద ప్రతి నెలా రెండో గురు, శుక్రవారాల్లో ఈ బజార్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో వివిధ పచ్చళ్లు, చీరలు, చేనేత, హస్తకళల బొమ్మలు, వైరు బుట్టలు, జూట్ బ్యాగులు, పంజాబీ డ్రెస్సులు తదితర వాటిని విక్రయిస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రోత్సహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కడియం: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని దుళ్లలోని భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ సమష్టి బాధ్యత

కడియం: ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎంఈవో నాగేశ్వరరావు అన్నారు. స్థానిక హైస్కూల్ హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగిన బాలికల సంరక్షణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో పలు పోటీలు నిర్వహించారు. హైస్కూలు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. వ్యాసరచనలో కడియానికి చెందిన జి.విజయలక్ష్మి ప్రథమ, వీరవరానికి చెందిన కె.యశ్వంత్ ద్వితీయ, జేగురుపాడుకు చెందిన పి.సువర్ణ తృతీయ స్థానాలు సాధించారు. వక్తృత్వంలో వీరవరానికి చెందిన సీహెచ్‌వీడీ మణికంఠ ప్రథమ, కడియానికి చెందిన టి.హేమ ద్వితీయ, జేగురుపాడుకు చెందిన వరలక్ష్మి తృతీయ స్థానాల్లో నిలిచారు. చిత్రలేఖనంలో ఓదూరి గౌతమీ నవ్యశ్రీజాత ప్రథమ, దిలీప్ ద్వితీయ, కార్తికేయ తృతీయ స్థానాలు సాధించారని పోటీల నిర్వాహకులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ తెలిపారు. మండల స్థాయిలో విజేతలు జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. ఉపాధ్యాయులు షేక్ ఇమామ్, ప్రసన్నకుమారి, సువర్ణవేణి, రాజు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం జగన్



కూనవరంలో పింఛన్ అందజేస్తున్న నాయకులు

సీతానగరం: రాష్ట్రంలోని పేదలందరికీ సీఎం జగన్ అండగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మండలంలోని కూనవరం సచివాలయంలో గురువారం పెన్షన్ వారోత్సవం ఘనంగా నిర్వహించారు. పింఛన్ రూ.2750 నుంచి రూ.3 వేలు పెరిగిన నేపథ్యంలో లబ్ధిదారులతో కలిసి సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, పార్టీ నాయకులు ఈ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సుంకర నరసింహం, యూత్ లీడర్ మేండ్రు నరేష్, దూలం వాసు, మాజీ ఎంపీటీసీ బూసి ఏసు, వెల్ఫేర్ అసిస్టెంట్ రామచంద్రరావు పాల్గొన్నారు.



కణుపూరు సచివాలయంలో పింఛన్ల పంపిణీ

కోరుకొండ మండలంలో..

మధురపూడి: మండలంలోని గ్రామాల్లో గురువారం పింఛన్ల పండగ నిర్వహించారు. పింఛన్లను రూ.2750 నుంచి రూ.3 వేలకు సీఎం జగన్ పెంచిన నేపథ్యంలో గ్రామాల్లో సందడి నెలకొంది. కోరుకొండ మండలంలో ప్రస్తుతం 12,582 మందికి నెలకు రూ.3 వేలు చొప్పున నగదు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలోని సచివాలయాల్లో సమావేశం నిర్వహిస్తున్నారు. బూరుగుపూడి, జంబూపట్నం, కణుపూరు గ్రామాల్లో సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు.